నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 23 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

కొత్తగూడెం సింగరేణి : నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

బొగ్గు గనులను వేలం వేస్తే ఊరుకోం..

కేంద్రప్రభుత్వంపై వెల్లువెత్తిన నిరసనలు

పాల్వంచ, జూన్ 22 : జాతీయ సంపద అయిన బొగ్గు గనులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలం వేయాలని చూస్తోందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేదిలేదని, సింగరేణి ప్రైవేటీకరణను జరగనివ్వమని కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాల్వంచ పట్టణంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవి, పట్టణ కార్యదర్శి సత్య మాట్లాడుతూ దేశంలోని 60 బొగ్గు బావులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు చూస్తోందని, అన్నిరంగాల కార్మికులు ఉద్యమించాలని అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గనులశాఖ పదవి చేపట్టగానే తెలంగాణకు తీరని అన్యాయం చేయబోతున్నారని విమర్శించారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడం శోచనీయమన్నారు. నిరసన కార్యక్రమంలో గట్టయ్య, మహేశ్, సాయి, శ్రీను, సామేలు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి, జూన్ 22 : సింగరేణి జీవీఆర్ ఓసీ వద్ద ఐఎన్‌టీయూసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను సింగరేణి జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, కొత్తగూడెం ఏరియా వైస్‌ప్రెసిడెంట్ రజాక్ తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐఎన్‌టీయూసీ సహించదని, వాటికి వ్యతిరేకంగా కార్మికులకు మేలు కలిగేలా సింగరేణి మనుగడను కాపాడుదామన్నారు. రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేవలం సింగరేణికి మాత్రమే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ రామారావు, బ్రాంచి సెక్రటరీ యర్రా భట్టి విక్రమార్క, క్రాంతికుమార్, నాగప్రకాశ్, చెన్న కేశవ, బాలాజీ, నగేశ్, సమ్మయ్య, కోటి, ఐ.వీ.రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, జూన్ 22 : మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి ఆధ్వర్యంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు నాగలక్ష్మి, జయ, పాపమ్మ, మంగి, అచ్చి, బుల్లి, సోన, విజయ, భారతి, సుజాత, భారతి పాల్గొన్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట, జూన్ 22 : దమ్మపేటలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జయ, నాగేంద్ర, అరుణ పాల్గొన్నారు.

కొత్తగూడెంలో..

కొత్తగూడెం సింగరేణి, జూన్ 22 : కేంద్రంలోని బీజేపీ సర్కార్ 60 బొగ్గు బ్లాక్‌లను వేలానికి పెట్టిందని, వెంటనే ఆపాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు పేర్కొన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.వీరన్న అధ్యక్షతన జరిగిన హెడ్డాఫీస్ ఎదుట ధర్నాలో ఆయన మాట్లాడారు. ఈ వేలాన్ని అన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకించాలని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏజే రమేశ్, బ్రహ్మచారి, సూరం ఐలయ్య, భూక్యా రమేశ్, విజయగిరి ఎణివాస్, గాజుల రాజారావు, కాంట్రాక్టు కార్మిక సంఘం బ్రాంచి అధ్యక్షుడు గడ్డం శ్యాంకుమార్, ప్రభాకర్, రమణ భాస్కర్, కొత్తపల్లి రమేశ్‌బాబు, సమ్మయ్య, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సత్తుపల్లి : సింగరేణి జీవీఆర్ ఓసీ వద్ద నిరసన వ్యక్తం చేసున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

టేకులపల్లి : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

- వారంలో సమస్యలన్నీ పరిష్కరించే దిశగా చర్యలు
- సాదా బైనామాలను తిరస్కరిస్తున్న అధికారులు
- కోర్టు ఉత్తర్వుల ప్రకారం కేసుల్లో ఉన్నవి పరిష్కారం
- ధరణి సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోనే రెండో స్థానం
- ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ధరణి పెండింగ్‌పై కసరత్తు

ధరణి ఫైళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, జూన్ 22 : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించారు. ఇటీవల రెవెన్యూ శాఖ కార్యదర్శి, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారంలోగా ధరణి వెబ్‌సైట్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను ఆదేశించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఖమ్మం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ రెవెన్యూ సిబ్బందితో దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అయితే జిల్లావ్యాప్తంగా చాలా మంది రైతులు సాదా బైనామా డాక్యుమెంట్స్‌తో ఆన్‌లైన్ ద్వారా తమ సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిన తర్వాత వచ్చిన 70 వేల సాదా బైనామా డాక్యుమెంట్స్‌తో ఉన్న దరఖాస్తులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అధికారులు వాటిని తిరస్కరిస్తున్నారు. వివిధ స్థాయిల్లో కోర్టు కేసులలో పెండింగ్‌లో ఉన్న వారు దరఖాస్తు చేసుకున్నా.. వాటిని కోర్టు ఉత్తర్వుల ప్రకారం పరిష్కరిస్తున్నారు. తహసీల్దార్ విచారణ నివేదిక తర్వాత వారి నుంచి ఆర్డీవో ద్వారా అదనపు కలెక్టర్ లాగిన్ వచ్చిన ఫిజికల్ ఫైళ్లను క్షేత్రస్థాయి నివేదికలతో సరిపోల్చుకుంటూ పరిష్కరిస్తున్నారు. అదనపు కలెక్టర్ ఆమోదం తర్వాత కలెక్టర్ లాగిన్‌కు చేరుకున్న ఫైళ్లపై కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే షిఫ్టులవారీగా ఈ ప్రక్రియను కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో చేపట్టారు. ఇప్పటివరకు తహసీల్దార్ లాగిన్‌లో 4,254, ఆర్డీవో లాగిన్‌లో 1,382, అదనపు కలెక్టర్ లాగిన్‌లో 1,556 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి రోజూ వీటిలో కొన్నింటిని పరిశీలించి పరిష్కరిస్తుండగా.. మండలాల నుంచి రోజుకు 200 ఫైళ్లు అదనపు కలెక్టర్ లాగిన్‌కు వచ్చి చేరుతున్నాయి. పెండింగ్ దరఖాస్తుల్లో.. డాటా కరెక్షన్(వివరాల సవరణ), టీఎం 33లో సర్వే నెంబర్లు, విస్తీర్ణం పేర్లు, పట్టాదారు పాస్ పుస్తకాల్లో వివరాలు తప్పుగా నమోదైనవి సవరించాలనే దరఖాస్తులు ఉన్నాయి.

పరిష్కారంలో రాష్ట్రంలోనే రెండో స్థానం

ధరణి వెబ్ పోర్టల్ ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం భూ సమస్యలను పరిష్కరించే ప్రక్రియలో ఖమ్మం జిల్లా ద్వితీయ స్థానంలో ఉంది. దరఖాస్తుల పరిష్కారంలో 73 శాతం ఆమోదం పొందుతుండగా.. 27 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. కొణిజర్ల మండలంలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో సవరణలు కోరుతూ జిల్లాలో ఇప్పటివరకు 78,710 దరఖాస్తులు ఉండగా.. వాటిలో 57,101 ఆమోదించి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారు. మరో 13,269 తిరస్కరణకు గురయ్యాయి. వీటిపై మరోసారి విచారణ చేపట్టి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. వాటిలో 8,340 పెండింగ్ దరఖాస్తులు కొణిజర్ల మండలంలోనే ఉన్నాయి. పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని, దీనికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పనులు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. న్యాయస్థానంలో కేసులు ఉన్నవి, సాదా బైనామా దరఖాస్తులు తప్ప మిగతా అన్ని సమస్యలు వారంలోపు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ఒకేసారి రూ.31 వేల కోట్ల రుణమాఫీ

- ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం..
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి(నేలకొండపల్లి), జూన్ 22 : రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశాల్లో మాట్లాడుతూ జూలై మొదటి వారం నుంచి రుణమాఫీ ప్రక్రియను మొదలుపెడుతున్నామని తెలిపారు. పేదవాడి కలలు తీర్చడం కోసం ఇందిరమ్మ రాజ్యం తేవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. అర్హులైన వారికి ఐదేళ్లలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామన్నారు. పాలేరు నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, ప్రజలు ఇచ్చిన అవకాశంతో నేడు రాష్ట్ర మంత్రినయ్యానని గుర్తు చేశారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్తానన్నారు. అనంతరం ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులు స్వీకరించి వాటిని సంబంధిత శాఖల అధికారులకు అంజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీరాం, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు వెన్నెపూసల సీతారాములు, శాఖమూరి రమేశ్, నెల్లూరి భద్రయ్య, దండా పుల్లయ్య, మామిడి వెంకన్న, వంగవీటి నాగేశ్వరరావు, బ్రహ్మ, యూత్ నాయకులు అంజి, సీపీఐ నాయకుడు బాగం హేమంతరావు పాల్గొన్నారు.

టీచర్ల ఖాళీల జాబితా విడుదల

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 22 : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లా విద్యాశాఖ శనివారం ఖాళీల జాబితాను విడుదల చేసింది. బదిలీలకు కనీస సర్వీస్ రెండేళ్లు, తప్పనిసరి బదిలీలకు ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొన్నది. బదిలీల కొరకు జిల్లావ్యాప్తంగా 1,810 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం అర్హులై ఉండి దరఖాస్తు చేసుకోని వారి నుంచి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించగా.. 15 మంది డీఈవోకు తమ దరఖాస్తులను అందజేశారు. వీరికి సంబంధించిన దరఖాస్తులను విద్యాశాఖ అధికారులు పరిశీలించి సీనియార్టీ, రోస్టర్‌లను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించారు. వీరిలో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకొని తప్పనిసరి బదిలీకి ఉన్న ఉపాధ్యాయులు 575 మంది ఉన్నారు. బదిలీల్లో ఉపాధ్యాయులు ఎంపిక చేసుకునే పాఠశాలలకు సంబంధించిన ఖాళీల తుది జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్‌జీటీలకు అర్హత కలిగిన 1,415 ఖాళీల జాబితాను ప్రదర్శించారు. వెబ్ ఆప్షన్స్‌కు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానున్నది.

శౌర్య పతకానికి ఎంపికైన దుమ్ముగూడెం సీఐ

సీఐ అశోక్

దుమ్ముగూడెం, జూన్ 22 : దుమ్ముగూడెం ఠాణాలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న అశోక్‌కుమార్ శౌర్య పతకానికి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన అధికారులను ఈ పతకానికి ఎంపిక చేస్తారని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. కాగా.. సీఐ అశోక్‌కుమార్ శౌర్య పతకానికి ఎంపిక కావడం పట్ల మండల ప్రజలు, పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ ఇన్‌స్పైర్‌కు మూడు ప్రాజెక్టులు

కొత్తగూడెం టౌన్, జూన్ 22 : 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అగ్రస్థానంలో నిలవడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో వెంకటేశ్వరాచారి, డీఎస్‌వో చలపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు, ప్రాజెక్టుల వివరాలను విడుదల చేశారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి మొత్తం 25 ప్రాజెక్టులు ఎంపిక కాగా.. భద్రాద్రి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కాగా.. జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులను డీఈవో, డీఎస్‌వోలు ప్రత్యేకంగా అభినందించారు.

హాజరు శాతం పెంచాలి : డీఈవో

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర శర్మ

ముదిగొండ, జూన్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. యడవల్లి, మేడేపల్లి, మాధాపురం పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఇంగ్లిష్ మీడియంలో ఎక్కువ మంది విద్యార్థులు చేరడాన్ని ప్రశంసించారు. తర్వాత సిబ్బందితో మాట్లాడి పాఠశాలల వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన తయారీని పరిశీలించి.. స్వయంగా రుచి చూసి నాణ్యతను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల హాజరు శాతం పెరగడానికి ఉపాధ్యాయులు వినూత్నంగా ఆలోచించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్ఫూర్తితో క్యాన్సర్ వైద్యసేవలు

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

మాట్లాడుతున్న మాజీ ఎంపీ నామా

ఖమ్మం, జూన్ 22 : బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి ఘనమైన చరిత్ర ఉందని, దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ స్ఫూర్తితో పేదలకు వైద్యసేవలు అందించడం జరుగుతున్నదని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి 24వ వార్షికోత్సవం వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే బాలకృష్ణతో కలిసి నామా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నామా మాట్లాడుతూ ఆసుపత్రి సేవలు మరింత విస్తరించేందుకుగాను 10ఎకరాల స్థలాన్ని ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సంబంధించిన భవనాల అనుమతులు కూడా త్వరగా వచ్చేలా ఆదేశాలు ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. సీఎం సహకారంతో ఆసుపత్రి పెండింగ్ సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన బసవతారకం క్యాన్సర్ వైద్యశాల దినదిన ప్రవర్ధమానమై దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో వర్ధిల్లుతున్నదన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సీఈవో కృష్ణయ్య, ట్రస్టు బోర్డు సభ్యుడు భరత్, నారా బ్రాహ్మణి, దత్తాత్రేయుడు, రాఘవరావు, దశరథ రామిరెడ్డి, శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ కౌన్సిలింగ్ షురూ..

విద్యార్థినికి ఓఎంఆర్ పత్రం అందజేస్తున్న కౌన్సిలింగ్ కోఆర్డినేటర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 22 : టీజీ పాలీసెట్-2024 ప్రవేశాల కౌన్సిలింగ్ శనివారం నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. ఈ నెల 25 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. తొలిరోజు 320 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా.. 318 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 27 వరకు వెబ్ ఆప్షన్స్, 30న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

వర్షం.. హర్షం

ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం

కరకగూడెం : అనంతారం వాగులో పారుతున్న వర్షపు నీరు

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కరకగూడెంలో భారీ వాన

ఖమ్మం నగరవాసులకు ఉపశమనం

ఖమ్మం వ్యవసాయం/కూసుమంచి/అశ్వారావుపేట టౌన్/కరకగూడెం/పెనుబల్లి, జూన్ 22 : ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. విత్తనాలు పెట్టి ఎదురుచూస్తున్న రైతన్నల కళ్లల్లో ఆనందం నింపింది. వ్యవసాయం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి సరైన వాన కురవకపోవడంతో అన్నదాతలు నిరాశలో ఉన్నారు. భూమిలో పెట్టిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో భయంభయంగా ఉన్న రైతులు శనివారం కురిసిన వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులందరూ విత్తనాలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ బోర్లు, చెరువుల కింద వరి నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. మరో రెండు, మూడు వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతాయని రైతులు చెబుతున్నారు.

కరకగూడెంలో భారీ వర్షం

కరకగూడెం మండలవ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, చెరువులకు కొత్తనీరు చేరుతున్నది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రైతులు నార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆనందంతో దుక్కులు దున్నుకుంటున్నారు. వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

ఖమ్మం నగరంలో..

ఖమ్మం నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న నగరవాసులకు ఉపశమనం కలిగింది. శనివారం ఉదయం నుంచి మేఘాలు అలుముకోవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది. నగరంలో ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం కలిగింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

అశ్వారావుపేటలో కురుస్తున్న వర్షం

పెనుబల్లిలో...

మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి చిరు జల్లులతో మొదలై శనివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో వారం రోజుల క్రితం కరివేద విధానంలో చల్లిన రైతులు వడ్లు మొలకెత్తడంతో పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు సాయంత్రం వరకు వర్షం ఎక్కువగా కురుస్తుందేమోననే ఉద్దేశంతో నీళ్లు బయటకు తరలించేందుకు ప్రయత్నాలు సాగించారు. వీఎం బంజర, టేకులపల్లి, లంకాలపాడు గ్రామాల్లో అధిక వర్షం కురవడంతో రైతులు సాగుపై దృష్టి సారించారు.

కూసుమంచిలో వర్షం

ఖమ్మం నగరంలో...